క్లుప్తంగా

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోండి

లింగాల: మండలంలో కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన వారు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఏఈఓలకు దరఖాస్తులు ఇవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ సబ్ స్టేషన్ పరిధిలోని పల్లెలకు గురువారం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బుధవారం ఏఈ రాకేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫర నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్యదర్శికి వినతి

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చల గ్రామ కార్యదర్శిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన ఇందిరాకు గ్రామ సీపీఎం నాయకుడు కిషోర్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

క్యాలెండర్, డైరీ అందజేత

కల్వకుర్తి రూరల్: ఏటీఓ విజయ్ కుమార్, ఎస్టీఓ రమాదేవిలకు టీయూటీఎఫ్ క్యాలెండర్, డైరీని బుధవారం టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శైలం, ప్రధాన కార్యదర్శి నేరటి రవీందర్ అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కల్వకుర్తి రూరల్: మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన ఆంజనేయులు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబానికి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ.3000 వేలను సమకూర్చారు. ఈ మేరకు బుధవారం గ్రామానికి చెందిన దారముని గణేష్ బాధిత కుటుంబానికి నగదు అందజేశారు. కార్యక్రమంలో సాయిబాబు, సత్యం, రాజేష్, నాగరాజు ఉన్నారు.

మాదిగల హక్కుల కోసం పోరాడుతాం



తాడూరు: మాదిగల హక్కుల కోసం పోరాడుతామని ఎమ్మార్పీఎస్ నాయకులు ఐతోలు లక్ష్మయ్య, శివప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని ఎత్మతాపూర్, ఆకునెల్లికుదురు గ్రామాల్లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించే సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాకుడు మందకృష్ణ మాదిగ పాల్గొంటారన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మాజీ సర్పంచ్ కురుమయ్య, బాలపీర్, అశోక్, బాలెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు సన్మానం



కల్వకుర్తి రూరల్: అడిషనల్ కలెక్టర్ అమరేందర్‌ను బుధవారం రాష్ట్ర మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు గోవిందు శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల విషయంపై చర్చించారు. బాలకృష్ణ, సాయి రాజా తదితరులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

కల్వకుర్తి టౌన్: మద్యం తాగి వాహనాలను నడిపిన ఒకరికి జరిమానాతో పాటుగా జైలుశిక్ష విధించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో రెండు రోజుల కిందట నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టణానికి చెందిన మీరాజ్ పట్టుబడ్డాడు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా జడ్జి కావ్య రెండు రోజుల జైలుశిక్షతో పాటుగా, రూ.100 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

హామీల అమలులో విఫలం



బిజినేపల్లి: హామీల అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందని బీఆర్ఎస్ నాయకుడు మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పూటకోమాట మాట్లాడుతూ ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు.

పనిచేసే వారికి గుర్తింపు

నాగర్‌కర్నూల్: పనిచేసే వారికిపార్టీలో తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వెలమ ఫంక్షన్ హాల్‌లో మండలానికి సంబంధించిన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీతో పాటు ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పని చేసిన వారికే అవకాశాలు ఉంటాయన్నారు. ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు సైనికుడిలా పనిచేయడం వల్లే ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలన్నారు. జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండడం మన అదృష్టమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

ఊర్కొండ: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతి కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఊర్కొండపేట పబ్బతి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలలో ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. బీజేపీతో పేదల సంక్షేమం సాధ్యమన్నారు. ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు వాగుల్ దాస్ నిరంజన్ గౌడ్, సీనియర్ నాయకులు గుజ్జుల ప్రతాపరెడ్డి, సామల నాగరాజు, అవినాష్, శ్యాంసుందర్ రెడ్డి, వెంకట్ నర్స్, అరవింద్ గౌడ్, తిరుపతి రెడ్డి, నారాయణ రెడ్డి తాడెంచిన్న, కొమ్మగోని వెంకటయ్య, ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతి కుమార్

డిజిటల్ మోసాలపై అప్రమత్తత అవసరం



కందనూలు: ప్రతి ఒక్కరు డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ కనకయ్యగౌడ్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. ఇంటర్నెట్ కలిగే లాభ నష్టాలను వివరించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ, వ్యక్తిగత సమాచారం చెప్పొద్దన్నారు. ఆకతాయిలు బాలికలను వేధిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం సీడబ్ల్యూయూ చైర్మన్ లక్ష్మణరావు మాట్లాడుతూ మొబైల్ ఫోన్‌లో సెట్టింగ్స్‌లో డిజిటల్ విల్‌బీయింగ్ ద్వారా తమ పిల్లలు ఎంతసమయం ఏ యాప్ వినియోగించారో తెలుస్తుందన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రీశైలం, సఖి అడ్మిన్ సునీత, బీఎస్ఎన్ఎల్ ఎస్డీఈ నరసయ్య, ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఈదమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు

కొల్లాపూర్: పట్టణంలో ఈదమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి శ్రీశైలం, విజయవాడ, సిరివేరికి చెందిన అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం మహిళలు ఎరుపురంగు చీరలు ధరించి 108 కలశాలతో మాధవస్వామి గుడి నుంచి ఈదమ్మ గుడి వరకు ఊరిగేంపుగా వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఆయన సతీమణి విజయమ్మలు హోమం పూజలు నిర్వహించారు. గర్భగుడిలోని ఈదమ్మ దేవత పాత విగ్రహాలను శాస్త్రోక్తంగా బయటకు తీశారు. దేవతామూర్తుల విగ్రహాలకు అభిషేకాలు చేశారు. ఉత్సవాలను నాయకులు నరేందర్‌రెడ్డి, సాకలి నర్సింహ్మా, బిజ్జ వేణు, రాంచందర్‌యాదవ్, సాంబశివుడుయాదవ్, కట్టా శ్రీనివాసులు, తదితరులు పర్యవేక్షించారు.



పాత దుస్తులు అందజేత

కల్వకుర్తి రూరల్: స్వామి వివేకానంద సేవ బృందం సభ్యులకు బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శర్వాణి 20 బ్యాగుల పాత దుస్తులను అందజేశారు. సభ్యులు లక్ష్మీనరసింహ, అజయ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు సన్నద్ధం

లింగాల: స్థానిక సంస్థల ఎన్నికల కోసం అధికారులు సన్నద్ధమవుతున్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల నియమ నిబంధనలకు సంబంధించిన బుక్ లెట్లను, అదే విధంగా నామినేషన్ పత్రాలను ఇతరత్రా ఎన్నికల సామాగ్రిని ట్రంక్ పెట్టెలలో భద్రపర్చారు. ఎన్నికల ప్రకటన ఎప్పుడు వచ్చిన ముందస్తుగా అన్ని సిద్ధం చేస్తుకుంటునట్లు అధికారులు తెలిపారు.

పౌష్టికాహారాన్ని అందించాలి



కోడేరు: విద్యార్థులకు పౌష్టికాహారం నాణ్యతగా అందించాలని పోషన్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ విజ్ఞాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని 3, 4, 5వ అంగన్‌వాడీ సెంటర్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల బరువు, ఎగుదలను గుర్తించారు. ప్రతి విద్యార్థికి పాలు, గుడ్లు ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. పలు రికార్డులు పరిశీలించారు. దూరెడ్డి లక్ష్మి, శిరీష, జ్యోతి, హైమావతి, పుష్ప, బొజ్జమ్మ పాల్గొన్నారు.

నూతన పద్ధతులతో బోధన చేయాలి



వెల్దండ: బోధనలో నూతన పద్ధతులను అవలంబించాలని జీహెచ్‌ఎం ప్రేమకుమారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొట్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో భౌతిక, రసాయన శాస్త్ర సబ్జెక్టుపై కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. కల్వకుర్తి డివిజన్ పరిధిలోని ఆయా పాఠశాలల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరి రామారావు, ఆర్పీఎస్ శివకుమార్, ఆయా పాఠశాలల సబ్‌జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన

తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం తాడూరు, తెలకపల్లి, నాగర్‌కర్నూల్ మండలాల సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు సముదాయ సమావేశం నిర్వహించారు. కాంప్లెక్స్ సెక్రటరీ కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్‌కు చేరిన బళ్లారి, మహారాష్ట్ర జట్లు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రాజీవ్–ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరుగుతున్న సీవీకే ఆల్ ఇండియా లెవల్ టీ–20 క్రికెట్ టోర్నీ రసవత్తరంగా కొనసాగుతోంది. ఆరోరోజు బుధవారం ఉదయం సెషన్‌లో గ్రూప్ ఏ నుంచి డాలీ సీసీ వర్సెస్ మస్కటి ఎలెవన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న డాలీసీసీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ధర్మేష్‌పటేల్ 49(29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు) వికెట్ కీపర్ అంకిత్‌ధానే 47(26 బంతుల్లో 3ఫోర్లు, 3సిక్సులు) ప్రత్యర్థి బౌలర్లు వంశీకృష్ణ 4-0-27-3, రాణించాడు. అమిత్‌సింగ్, నిఖిల్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం 172 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన మస్కటి ఎలెవన్ 18.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసి విజయభేరీ మోగించింది. జట్టు ఓపెనర్ ప్రశాంత్ టోర్నీలో తొలి సెంచరీ నమోదు చేశాడు. ఆది నుంచి దూకుడుగా ఆడాడు. 61 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 102 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ను ప్రశాంత్ అందుకున్నాడు. గ్రూప్ బీ నుంచి మధ్యాహ్నం సెషన్‌లో ఖలీం–11 మహారాష్ట్ర వర్సెస్ ఏఆర్‌ఎం సీసీ హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖలీం –11(మహారాష్ట్ర) 19.5 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటయ్యింది. అంకిత్ కౌశిక్ 33, యాష్‌యాదవ్ 29, పవన్‌నిర్వాణి 26, మిట్ట లేఖాజ్ 22 పరుగులు చేయగా మిగతా బ్యాట్స్‌మెన్లు సింగిల్ డిజిట్లకే పరిమితమై పెవిలియన్‌కు వెళ్లారు. ప్రత్యర్థి బౌలర్లు ఇర్ఫాన్ ఉల్‌హక్ 3.5-0-22-4, ఆజీమ్‌రాథర్ 4-0-31-3, డాన్నీ 4-0-35-2 వికెట్లతో రాణించారు. 147 పరుగుల విజలక్ష్యంతో బరిలోకి దిగిన ఏఆర్‌ఎం సీసీ 17.3 ఓవర్లలో 128 పరుగులకే కుప్పకూలింది. దీంతో 18 పరుగుల తేడాతో ఖలీం–11 మహారాష్ట్ర గెలిచింది. జట్టు బ్యాట్స్‌మెన్ ఆజీం రాథర్ 37(27 బంతుల్లో 3ఫోర్లు, 2సిక్సులు), ఆకాష్‌ఆయోబ్ 24, నవీద్‌బంగ్రీ 15 పరుగులు మాత్రమే చేయగా మిగతా బ్యాట్స్‌మెన్లు చేతులెత్తేశారు. ప్రత్యర్థి బౌలర్లు అభిషేక్ ఖండేల్ 4-0-20-3, పవన్ నిర్వాణి 2-0-20-2, సెనిల్ జాకోలియా, వైభవ్‌మలి, ఇస్తియాక్ రసూల్, అంకిత్‌కౌశిక్ చెరో వికెట్ తీసి జట్టు విజయంలో కీలకంగా నిలిచారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ను పవన్‌నిర్వాణి అందుకున్నాడు.

నేడు సెమీఫైనల్స్

ఉదయం సెషన్‌లో మొదటి సెమీ ఫైనల్‌లో గ్రూఫ్ ఏ నుండి బళ్లారి వర్సెస్ మస్కటి ఎలెవన్ హైదరాబాద్, మధ్యాహ్నం సెషన్‌లో రెండో సెమీ ఫైనల్‌లో గ్రూఫ్ బి నుంచి మన్నెవారిపల్లి సీసీ వర్సెస్ ఖలీం –11 మహారాష్ట్ర జట్లు తలపడనున్నాయని నిర్వాహకులు కపిలవాయి చంద్రమోహన్, కటకం రఘురాం తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

అమ్రాబాద్: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పదర మండలం వంకేశ్వరం, పదర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు రాయలగండి కేజీబీవీని అధ్యాపక బృందంతో కలిసి సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు ఇంటర్ విద్యపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాలలో వసతుల గురించి, ప్రోత్సహకాలు గురించి వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం ఇంటర్‌లో ప్రవేశాలు పొందాలని సూచించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడంపై హర్షం

ఊర్కొండ: మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంపై బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పాలాభిషకం చేసి కేక్ కట్ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ముచర్ల జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాలను ప్రాధాన్యం ఇస్తోందన్నారు. బీజేపీ జిల్లా నాయకుడు గుడిగానిపల్లి రాజు మాదిగ, మండల అధ్యక్షుడు ధార రాధా, కృష్ణ, జంగయ్య, లక్ష్మారెడ్డి, బంగారయ్య, పరమేష్, మల్లేష్, చిన్నరాజు, వీరస్వామి, రవి, గోపాల్, పరశురాములు, రాము, మహేష్, రాజేష్, జగన్, శ్రీశైలు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



వెల్దండ: మూడు నెలలుగా వేతనాలను చెల్లించడం లేదని బుధవారం జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీఓ సత్యపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా ఈజీఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు అందడం లేదన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్‌గౌడు, టీఏలు రాజ్‌కుమార్, లింగస్వామి, లక్ష్మీదేవి, శివలీల, విజయ్‌కుమార్, సత్యనారాయణ, రాము, ఉస్సేన్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

చారకొండ: వేతనాలు చెల్లించాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్‌కు ఉపాధి హామీ ఉద్యోగులు వినతి పత్రం అందించారు. అంతకుముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మయ్య, ఈసీలు రవి, ఎల్లయ్య, టీఏలు యాదయ్య, ఆపరేటర్స్ ఖాదర్, వెంకటేష్, అల్లాజి, ఎఫ్‌ఏలు లక్ష్మయ్య, శ్రీను ,తదితరులు ఉన్నారు.

ఊర్కొండ: పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఉపాధిహామీ ఉద్యోగులు బుధవారం ఎంపీడీఓ కృష్ణయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో భారతమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్, బాలరాజు, ఎల్లయ్య, కృష్ణయ్య, మల్లేష్, ఆంజనేయులు, నరసింహులు, వెంకటయ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కందనూలు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నరేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ ఖేల్ ఉత్సవాలు రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్ జయంతిలను పురస్కరించుకొని దేశవ్యాప్తంగా బాల, బాలికలకు క్రీడాపోటీలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. జిల్లా కన్వీనర్ శివశంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. బంగారుబాబు, జిల్లా ఖేల్ కన్వీనర్ రమేష్, సంయుక్త కార్యదర్శి శివ, మల్లేష్, పాల్గొన్నారు.

తిమ్మాజిపేట: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేల్ ఉత్సవంలో భాగంగా కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ అనసూయ, ఎంఈఓ సత్యనారాయణ శెట్టి, అధ్యాపకులు వెంకన్న, వెంకటయ్య, వివేకానంద కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, నిశ్వంత్, రాజు, బంగారు, మధు, కన్వీనర్ వెంకటేష్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ హెచ్చరించారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలోని తన చాంబర్‌లో పారిశుద్ధ్య కార్మికులు, ఇతర శానిటరీ కార్మికులు, జవాన్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలోని అన్ని వార్డులలో మురుగుకాల్వలు, రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వార్డుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణలో ఆటో డ్రైవర్లు కొంత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని, జవాన్లు, డ్రైవర్లు వారి తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా చెత్తను రీసైక్లింగ్ చేసే డీఆర్‌సీసీ సెంటర్ నిర్వహణ సరిగ్గా చేపట్టాలని, ప్రధాన రోడ్లలో ఎలాంటి చెత్త లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను పరిశీలించి, విద్యార్థులకు అందించే భోజనంపై వివరాలను అడిగి తెలుసుకొని కిచెన్, కిరాణ సరుకులు నిల్వ ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ రాజకుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, జవాన్లు, డ్రైవర్లు, పారిశుద్ధ్యం కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ మహమూద్ షేక్

ఖాళీ బిందెలతో నిరసన



కొల్లాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సమీప ప్రాంతాలకు చెందిన మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కొన్ని రోజులు కాలనీల్లో తాగునీటి సరఫరా కావడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. బీఆర్ఎస్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా శ్రీనివాస్ వారికి మద్దతు తెలిపారు.

అంబా రామలింగేశ్వరస్వామికి పూజలు

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన ఆలయంలో మౌని అమావాస్య పురస్కరించుకొని శివలింగానికి తైలాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, తదితరులు ఉన్నారు.

పోతిరెడ్డిపల్లిలో పశువైద్య శిబిరం

తిమ్మాజిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో పశువైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి 35 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 42 పశువులకు సాధారణ చికిత్సలు, 53 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. పశువైద్య సిబ్బంది తిరుపతయ్య, గోపాల మిత్రలు స్వామి, జగ్జీవన్, నరేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తిమ్మాజిపేట: మండలంలోని మారేపల్లికి చెందిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ నేరళ్లపల్లి శ్రీనివాసులు స్వంత ఖర్చులతో బుధవారం గ్రామంలోని పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. హెచ్‌ఎం ప్రేమలత, శ్రీరాం, ఉపాధ్యాయులు, యువకులు కృష్ణయ్య, రాజ శేఖర్, శివలింగం, శేఖర్, రమేష్, శివ, శ్రీకాంత్, సందీప్, రాజులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇసుక వివాదం

తెలకపల్లి: మండలంలోని నడిగడ్డలో దుందుబీ వాగు నుంచి ఇసుకను తరలించొద్దని వారం రోజుల నుంచి రైతులు ఆందోళన చేస్తున్నారు. కొంతమంది రైతులు రోజుకో విధంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండగా గ్రామ రైతులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు శాంతింపజేసినా ససేమిరా అన్నారు. పోలీసుల సమక్షంలో 32 ట్రాక్టర్ల ఇసుకను తరలించారు. రైతులు ఇసుకను అడ్డుకోవడం సరైనది కాదని కలెక్టర్ ఆదేశానుసారమే అనుమతులతో ఇసుకను తీసుకెళ్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కోడేరు: ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఓబులేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తుదారుల వివరాలను ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్, గురుబ్రహ్మం పాల్గొన్నారు.

ఐదుగురు కార్యదర్శులకు స్థాన చలనం

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఐదు మంది కార్యదర్శులకు బదిలీలు అయ్యాయి. మండలంలోని లింగసానిపల్లి, వేపూరు, గుండూరు, మార్చాల, తర్నికల్ గ్రామాల్లో పనిచేస్తున్న సురేష్ గౌడ్, రామకృష్ణ, మురారాచారి, రమేష్, హరిణిలు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో వంశీగౌడ్, వీరస్వామి, బాలరాజు, ఇందిర, మహేశ్వరిలు బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయమై ఎంపీడీఓ వెంకట్‌రాములును వివరణ కోరగా సాధారణ బదిలీలేనని పేర్కొన్నారు.

నీటి తరలింపుపై పునరాలోచించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఏదుల రిజర్వాయర్ నుంచి డిండికి నీటి తరలింపు నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం బాలనరసింహ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏదుల డిండి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి నీటిని తరలిస్తే రైతులు నష్టపోతారన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్ ఆనంద్ జీ, ఎస్ఎండీ ఫయాజ్, వార్ల వెంకటయ్య, నాయకులు కృష్ణాజీ, టీ నరసింహ, యేసయ్య, చంద్రమౌళి, మారేడు శివశంకర్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



చారకొండ: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్‌ఐ శంషుద్దీన్ అన్నారు. మండలంలోని రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారిపై వాహనదారులకు, ప్రయాణికులకు రోడ్డు నియమ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తిరుమల్ రావు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలీసులు, విద్యార్థుల ర్యాలీ

దోమలపెంట: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు పురస్కరించుకుని బుధవారం దోమలపెంటలోని శ్రీశైలం ప్రధాన రహదారిలో ఈగలపెంట ఎస్‌ఐలు వీరమల్లు, శ్రీను ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం, రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం అని నినాదాలు. హెడ్ కానిస్టేబుల్ యాదయ్య, ఉపాధ్యాయులు శంకర్‌నాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

లింగాల: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద హెల్మెట్ వాడకంపై వాహనదారులకు హెడ్ కానిస్టేబుళ్లు వెంకటేష్, సహదేవ్ అవగాహన కల్పించారు. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

లింగాల: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందివ్వాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను బుధవారం ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. నిత్యావసర సరుకులను, భోజనాన్ని పరిశీలించారు. వంటశాలను, డైనింగ్ హాల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాలలను బుధవారం తహసీల్దార్ ఇబ్రహీం ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్‌లో ఉన్న వసతిగృహాలను, మరుగుదొడ్లు, వంటగది, డైనింగ్ పరిసరాలను ఆయన పరిశీలించారు.

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని కస్తూర్భాగాంధీ విద్యాలయాన్ని బుధవారం మండల ప్రత్యేకాధికారి కమల్‌కుమార్ సందర్శించారు. వంటగదులను, కూరగాయాలను, భోజనాన్ని పరిశీలించారు. కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రత్యేకాధికారి సుజాత, విద్యాలయం ఉపాధ్యాయులు ఉన్నారు.



లింగాల గురుకుల పాఠశాలలో వంటకాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

ఇంట్లో రూ. 83 వేలు చోరీ

ఉప్పునుంతల: మండల కేంద్రానికి చెందిన మడ్డి తిర్పతయ్యగౌడ్ ఇంటి తాళాలు విరుగొట్టి బీరువాలో ఉన్న రూ. 83 వేలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తిర్పతయ్యగౌడ్‌కు వెంకటేశ్వర కాలనీలో రెండు ఇళ్లు ఉన్నాయి. ఒక ఇంటిలో నిద్రించగా మరో ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తలుపులు తెరచి ఉండటంతో దొంగతనం అయ్యిందని భావించి ఇంట్లోకి వెళ్లి చూడగా మొత్తం రూ.83 వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించారు.